మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

# గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

**గద్వాల ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవడానికి సర్పంచులు ముఖ్య పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ అన్నారు. ఎర్రవల్లి మండల కేంద్రంలోని పదవ బెటాలియన్ లో సోమవారం ఐజ, రాజోలి, అలంపూర్, ఎర్రవల్లి, ఇటిక్యాల, మానవపాడు మండలాల సర్పంచులకు ఐదు రోజులపాటు నిర్వహించు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టంలో ఉన్న అన్ని అంశాలను నూతనంగా ఎన్నికైన సర్పంచులు తెలుసుకొని అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు గ్రామస్థాయిలో ఉండే వివిధ ప్రభుత్వ శాఖల వ్యవస్థలపై పూర్తి అవగాహన అవసరమన్నారు. తాగునీరు, పారిశుద్ధం, విద్యుత్, విద్య, ఆరోగ్యం, తదితర ప్రధాన విషయాల్లో బాధ్యత వహించే అధికారులు, సిబ్బంది గురించి తెలుసుకొని తమ తమ గ్రామపంచాయతీలలో ఆయా వ్యవస్థలు సక్రమంగా, పనిచేసేందుకు సర్పంచులు బాధ్యత – మిగతా4లో..



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

# ఫిర్యాదుల వెల్లువ

**ప్రజావాణికి 87 వినతులు**

**సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశం**

**ఫిర్యాదు దారులకు ఇబ్బంది లేకుండా కుర్చీల ఏర్పాటు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** ప్రజావాణికి ఫిర్యాదుదారులు పోటెత్తారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగాగతంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించని సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎన్నికల అనంతరం సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువలా అందాయి. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ మీటింగ్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 87 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా పరిషత్ సీఈవో వెంకట్ రెడ్డి, డిఆర్‌డిఓ నరసింహులు, ఆర్డీఓ నవీన్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులు భారీ ఎత్తున తరలి రావడంతో పిటాపురం స్వీకరించేందుకు ఆలస్యం అవుతున్న సందర్భంగా కలెక్టర్ స్పందించి ఫిర్యాదుదారులకు కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేశారు. వృద్ధులు సీనియర్ సిటిజన్లు కూర్చోవడానికి వెసులుబాటు కల్పించడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈసమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# చెరువు కట్టపై ముసలి సంచారం.. భయాందోళనలో ప్రజలు..



చెరువు కట్ట పై ముసలి సంచరిస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామ సమీపంలో గల చెరువు కట్టపై ముసలి సంచరిస్తుండడంతో గ్రామ ప్రజల తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. సోమవారం తెల్లవారుజామున రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు చెరువు కట్టపై వెళ్తుండగా అకస్మాత్తుగా ముసలి సంచరిస్తూ ఉండడంతో భయాందోళనకు గురై తిరిగి గ్రామానికి వెళ్లారు. గత కొన్ని రోజులుగా చెరువు కట్టపై ముసలి సంచరిస్తుందని విషయాన్ని అటు అటవీ శాఖ అధికారులకు మరియు ఇటు ప్రభుత్వ అధికారులకు విన్నవించిన ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. మూలమల్ల గ్రామం నుండి ప్రతినిత్యం వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ప్రజలు మరియు రైతులు చెరువు కట్టపై రహదారి మార్గంగా కొనసాగుతున్న నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ముసలిని బంధించే విధంగా చర్యలు చేపట్టాలని లేని పక్షంలో ప్రజలు తీవ్ర కలత చెందే విషయాన్ని గుర్తించాలని మూలమల్ల గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రైతు భరోసా, రుణమాఫీలు వెంటనే

# అమలు చేయాలి

- ◆ బిఆర్‌యస్,కాంగ్రెస్ పార్టీలు రైతులను మోసం చేశాయి
- ◆ రైతు సంఘర్షణ సభలో కవిత మండిపాటు
- ◆ వందలాది రైతులతో కలెక్టరేట్ ముట్టడి అడ్డుకున్న పోలీసులు
- ◆ అక్కడే బైఠాయించి ఆందోళనకు దిగిన కవిత,రైతులు



రైతులతో కలిసి ర్యాలీగా వెళుతున్న కవిత



వేదికపై మాట్లాడుతున్న కవిత

**గద్వాల ఫిబ్రవరి23, ప్రభాతవార్త:** బిఆర్‌యస్, కాంగ్రెస్ పార్టీలు రైతులను మభ్యపెట్టి మోసం చేశాయని, కాంగ్రెస్ ప్రభుత్వం 15 లక్షల మంది రైతులకు రుణమాఫీ ఎగ్గొట్టిందనీ, వెంటనే వారికి రుణమాఫీ మంజూరు చేయాలనీ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.సోమవారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గద్వాలలో నిర్వహించిన రైతు సంఘర్షణ సభకు ఆమె ముఖ్య తిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రజల కోసం కొత్త ఆయుధాన్ని సిద్ధం చేస్తున్ననని, ఆ ఆయుధం మీ చేతిలో రాజకీయ అస్త్రమవుతదనీ అన్నారు. నడిగడ్డ సీడ్ పత్తి రైతులకు వారంలోగా బకాయిలు చెల్లించాలనీ,లేదంటే రైతులందరితో కలిసి గద్వాల్‌లో పెద్ద ఎత్తున దీక్ష చేపడతాం అని మండిపడ్డారు. తుమ్మిళ్ల, నెట్టింపాడు పనులు చూసి నత్తలు కూడా సిగ్గుపడుతున్నాయనీ, నడిగడ్డ ప్రజలను బీఆర్ఎస్ మోసం చేసిందనీ, అదేవిదంగా కాంగ్రెస్ కూడా రైతులకు అన్యాయం చేస్తోందన్నారు. కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు వందలాది మంది రైతులతో కలిసి వెళ్లిన కవితను కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు.ఆమె రైతులతో కలిసి అక్కడే బైఠాయించి ఆందోళన చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన అన్ని హామీలను తుంగలో తొక్కి వారిని మోసం చేస్తుందని, అధికారంలోకి రాగానే 2 లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికి 15 లక్షల మంది రైతులకు రుణమాఫీ ఎగ్గొట్టిందన్నారు. రైతు రుణమాఫీకి సంబంధించిన లెక్కలపై చర్చకు రావాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. నడిగడ్డ సీడ్ పత్తి రైతులకు జరుగుతున్న అన్యాయంపై ఆవేదన వ్యక్తం చేశారు. వారికి రావాల్సిన బకాయిలను ఇవ్వకుండా రైతులను వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లోగా రైతులకు ఇవ్వాల్సిన బకాయిలన్నీ ఇవ్వకపోతే గద్వాల్‌లో పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు. రైతులతో కలిసి దీక్ష చేపడతామన్నారు. రైతులకు కరెంట్, యూరియా సప్లయ్ చేయటం కూడా ప్రభుత్వానికి చేతకావటం లేదని ఎద్దేవా చేశారు. యూరియా కోసం యాప్ లో బుక్ చేసుకోవాలని ప్రభుత్వం రూల్ పెట్టటాన్ని ఆక్షేపించారు. ముందు రైతులకు స్మార్ట్ ఫోన్లు ఇచ్చి ఆ తర్వాత యాప్‌లో బుక్ చేసుకునే విధానం తేవాలన్నారు. రైతు భరోసాను ఈ ముఖ్యమంత్రి ఎన్నికల కోసం ఇచ్చే గిఫ్ట్ చేసేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ముందు రైతు భరోసా వేస్తామంటూ నిసిగ్గుగా చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలప్పుడు మాత్రమే ప్రభుత్వానికి రైతులు గుర్తు వస్తున్నారన్నారు. అటు అడవిలో అన్నలకు, ఇటు రైతన్నలకు మాత్రమే అందరూ భయపడతారని గుర్తు చేశారు. ఐతే అన్నలను కేంద్రం అమానవీయంగా చంపుతుంటే...రైతన్నలను రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా ఇబ్బంది పెడుతోందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని...రైతన్నలను తిప్పలు పెడుతున్న కాంగ్రెస్ కు ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారని అన్నారు.రైతన్నలకు – మిగతా4లో..

# భూ కబ్జాలు సీఎం దృష్టికి తీసుకెళ్లా..

**జడ్చర్ల, కొడంగల్‌లో 1700 ఎకరాల భూములు మాయం**

**త్వరలోనే ఆధారాలు బయటకు వస్తాయి**

**ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వెల్లడి**



పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** భూ కబ్జాలకు ఎవరు పాల్పడ్డారో, ఎవరి హయాంలో ఇసుక అక్రమ రవాణాను అణిచి వేయడానికి ఎక్కువగా కేసులు పెట్టడం జరిగిందో త్వరలోనే ఆధారాలతో సహా బయటపెడతానని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రకటించారు. జడ్చర్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఒక నాయకుడు ఎస్సీ, ఎస్టీలకు చెందిన 600 ఎకరాల భూమిని కొట్టేసారని, దానికి సంబంధించిన ఆధారాలు కూడా త్వరలోనే బయటకు వస్తాయని వెల్లడించారు. కొండకల్, మోకిలా ప్రాంతాల్లో 1100 ఎకరాల గిరిజన భూములను కొట్టేసిన వారు త్వరలోనే జైలుకు వెళ్తారని తెలిపారు. జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండలంలోని పెద్దాయిపల్లి గ్రామంలో రూ.50 లక్షల ముడా నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులకు సోమవారం అనిరుధ్ రెడ్డి శంఖుస్థాపన చేసారు. ఈ సందర్భంగానే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, తన హయంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందంటూ బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా జరిగినప్పుడు ఎన్నికేసులు పెట్టారో, తాను ఎమ్మెల్యే అయ్యాక ఇసుక రవాణాపై ఎన్ని కేసులు పెట్టారో ఆధారాలతో సహా ప్రజల ముందు పెడతామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెరువులు కుంటలలో లేఅవుట్లకు అనుమతులు ఇచ్చారని, అలాంటి అక్రమ లేఅవుట్లు అన్నింటినీ తాను రద్దు చేయిస్తానని హెచ్చరించారు. ఆధారాలు ఉంటేనే తాను ఏదైనా మాట్లాడుతానని అన్నారు. ఎన్ని రియల్ ఎస్టేట్ వెంచర్లలో రోడ్లు, డ్రైనేజీలు వేయకుండానే పర్మిషన్లు ఇచ్చారో, నిబంధనల ప్రకారంగా మౌళిక వసతులు కల్పించకుండానే లే అవుట్ మార్టిగేజ్ లను ఎలా క్లియర్ చేసారో మీ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత లక్ష్మారెడ్డిని వచ్చి మాట్లాడమని చెప్పాని సూచించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఒక నాయకుడు ఎస్సీ, ఎస్టీలకు చెందిన 600 ఎకరాల భూములను కొట్టేశారని, వాటికి సంబంధించిన రికార్డెడ్ డాక్యుమెంట్లు లేకపోయినా వాటికి సంబంధించిన ఆధారాలు కూడా బయటపడతాయని అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. దీంతో పాటుగా రంగారెడ్డి జిల్లా కొండకల్,మోకిల్లాలో 1100 ఎకరాల భూమిని బీఆర్ఎస్ నేత కబ్జా చేసిన విషయం గురించి – మిగతా4లో..

# పదవ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**మార్చి 14 నుండి పరీక్షలు ప్రారంభం: జిల్లా కలెక్టర్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** మార్చి 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు కొనసాగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 7,228 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 37 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణ కోసం 37 మంది సూపర్డెంట్లు, 37 మంది డిపార్టుమెంటల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు పరీక్షల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు – మిగతా4లో..





మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

## మత్తు వదలండి

# మైదానాలు చేరండి

**క్రీడలపై ఆశ, శ్వాస, ధ్యాస ఉంటేనే ఉత్తమ క్రీడాకారులుగా రాణించగలుగుతారు**

**చిన్న చిన్న సమస్యలకు కుంగుబాటు వద్దు**

**సెకండ్ ఎడిషన్ సీఎం కప్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ముగింపు సభలో మంత్రి వాకిటి శ్రీహరి**

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** మక్తల్ లో నాలుగు రోజుల పాటు జరిగిన సెకండ్ ఎడిషన్ సీఎం కప్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలు ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలకు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథి గా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఫైనల్లో పురుషుల విభాగంలో రంగారెడ్డి జిల్లా జట్టు పై వనపర్తి జిల్లా 20 పాయింట్ల తేడాతో గెలుపొందగా, మహిళల విభాగంలో రంగారెడ్డి జిల్లా జట్టు పై జోగులాంబ గద్వాల జిల్లా జట్టు 5 పాయింట్ల తేడాతో గెలుపొందింది. ఇరు జట్ల మధ్య ఆడుతున్న తీరును మంత్రి శ్రీహరి స్వయంగా వీక్షించారు. విజేతలకు శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు మక్తల్‌లో అంగరంగ వైభవంగా కబడ్డీ పోటీలు జరిగాయన్నారు.33 జిల్లాల నుండి సుమారు 1200 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు.మక్తల్ ప్రాంతానికి కబడ్డీకి అవినాభావ సంబంధం ఉందని తెలియజేశారు. మైదానం మాత్రమే క్రీడలో ఓడినా కూడా మళ్ళీ గెలిచే కసి వచ్చేలా చేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్న చిన్న సమస్యలకు మానసికంగా కుంగి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడలు మాత్రమే వీటన్నిటికీ పరిష్కారం చూపగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. ఓటమి గెలుపునకు తొలి మెట్టు అని క్రీడాకారులకు సూచించారు. క్రీడలపై ఆశ,శ్వాస ఉంటేనే ఉత్తమ క్రీడాకారులుగా రాణిస్తారని మంత్రి పేర్కొన్నారు.ప్రపంచాన్ని వదిలి – మిగతా4లో..

# నల్లమల్లలో గిరిజనులకు అరుదైన ఆలయ నిర్మాణం

**రూ.200 కోట్లతో సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణం**

**గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే చేయూత**

**టి పిసిసి ఉపాధ్యక్షుడు డా. చిక్కుడు వంశీకృష్ణ**



ర్యాలీలో గిరిజన సోదరులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

**ఉప్పునుంతల,ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోనే గిరిజనులు (లంబాడి) వారికి అరుదైన ఆలయాన్ని కాంగ్రెస్‌ప్రభుత్వం హయాంలోనే 200 కోట్లతో సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయం నిర్మాణం చేపట్టడం జరుగు తుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం అచ్చంపేట పట్టణంలో బంజారా సమాజ ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో గిరిజన భవన్ నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు, స్తభస్తలం వరకు గిరిజన సోదరులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో గిరిజన సోదరులు గిరిజన సంస్కృతి పై సంస్కృతిక కార్యక్రమాలు, వేషధారణ, డంప్పు, దరువు కార్యక్రమంపై భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా పరిధిలో పలు బంజారా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గిరిజన సదరులు గిరిజన సంస్కృతి సాంప్రదాయంతో తలపాగా పెట్టుకొని పలువురిని ఆకర్షింప చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిదిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గిరిజన సోదరులు ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ నల్లమల్ల ప్రాంతమైన మద్దిమడుగు ప్రాంతంలోని శ్రీ అంజనేయ స్వామి ఆలయప్రాంగణం సమీపంలో దాదాపు 20ఎకరాల స్థలంలో రూ.200 కోట్ల వ్యయంతో సంతోష్ సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని నిర్మించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించడం జరిగిందని ఆయన వివరించారు. గిరిజన సోదరుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ ఆలయం నిర్మాణం చేపట్టడంతో నల్లమల ప్రాంతం టూరిజం హబ్ ఏర్పడుతుందని అన్నారు. గిరిజన సోదరులు నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు రాబోయే రోజుల్లో అధికారి కంగా నిర్వహించేందుకు తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నల్లమల్ల ప్రాంతంలో సంత్ సేవాలాల్ – మిగతా4లో..

# మున్సిపల్ అభివృద్ధికి సహకరిస్తా

**-ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**



చైర్మన్,వైస్ చైర్మన్‌లను సన్మానిస్తున్న మంత్రి

**కల్వకుర్తి, ఫిబ్రవరి23 ప్రభాతవార్త:**కల్వకుర్తి మున్సిపల్ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు. సోమవారం నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్‌లు హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా మంత్రి జూపల్లి కృష్ణారావును కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్‌లు మంత్రి జూపల్లి కృష్ణారావును శాలువాలతో సన్మానించి కల్వకుర్తి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్, వైస్ చైర్మన్‌లను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోళి సురేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# కుమ్మెర జాతరలో జరిగిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలి

- ◆ జిల్లా ఎస్పీ, కలెక్టర్ ఆ గ్రామాన్ని వెంటనే సందర్శించి బాధితులకు భరోసా ఇవ్వాలి
- ◆ సంఘటన పట్ల మౌనం వహించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే నోరు తెరవాలి
- ◆ నిందితులను వెంటనే అరెస్టు చేయాలి
- ◆ సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్



బాధితులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకుంటున్న సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:**కుమ్మెర గ్రామంలో రెండు నెలల పసిబిడ్డను అత్యంత క్రూరంగా అమానవీయంగా కాలితో తన్ని హత్య చేసిన ఘటన పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించాలని, ఆ గ్రామ అగ్రకుల పెత్తందారులు శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సతీష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కన్నిరెడ్డితో పాటు మరికొందరిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంతోపాటు హత్యా నేరం కింద కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. జిల్లా ఎస్పీ, కలెక్టర్ ఆ గ్రామాన్ని సందర్శించి బాధితులకు భరోసా ఇవ్వాలని, మౌనం వహించిన ఎమ్మెల్సీ ఎమ్మెల్యే నోరు తెరవాలని, ఘటన పట్ల పోలీసుల నిరక్ష్యం వీడాలని సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ధర్నా శిబిరం వద్ద బాధితులను పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బాధిత కుటుంబానికి భరోసాగా అండగా ఉండి బాధితులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ పండగలు, ఉత్సవాలలో కులవివక్ష అగ్రకుల దురహంకారంతో ప్రజల మధ్య కులవిద్వేషాలు సృష్టించడం, దేవుడి దగ్గర అందరూ సమానం కాదని, అహంకారము ప్రదర్శించడంవల్ల ఈ ఘటన జరిగిందన్నారు. దేవుని దగ్గరికి వెళ్లడానికి రూ.100లు ఫీజు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించిన పాపానికి,సుమారు మూడున్నర గంటల పాటు గణేష్ అనే యువకుడిని కొట్టారని ఆయన అన్నారు. తన భర్తను కొట్టవద్దని తన తమ్ముడిని కొట్టవద్దని గణేష్ అక్క కీర్తి, భార్య మౌనిక ఎంతగా బ్రతిమిలాడిన కాళ్లు మొక్క డానికి ప్రయత్నం చేసిన కాళ్లతో తన్నారు తప్ప కనికరించలేదని, రెండు నెలల పసిబిడ్డ ఉంది నా భర్తను కొట్టకండి చంపకండి అని వేడుకున్న చివరికి ఏమాత్రం కనికరం లేకుండా అమానవీయంగా మానవ మృగంలా రెండు నెలల పసిబిడ్డపై కూడా కాలితో తన్ని క్రూరంగా పసిబిడ్డను హత్య చేశారని ఇంత జరిగినా ఈ సంఘటన పట్ల ఈ జిల్లా వాసి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించకపోవడం విడ్డురంగా ఉందని చాలా సిగ్గుగా ఉందని ఆయన విమర్శించారు.ఈఘటన సమాజం సిగ్గుతో తలదించుకునే విధంగా మానవత్వాన్ని మంటగలిపే విధంగా ఉందన్నారు. సంఘటన జరిగిన 4 రోజులు గడుస్తున్న బాధితులను ఇంకా అరెస్టు చేయకపోవడంలో పోలీసుల యొక్క నిరక్ష్యం కనిపిస్తుందని దీనికి అధికార పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వంత పాడుతున్నారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆటవిక పాలన కొనసాగుతుందని, ప్రజాపాలన కాదని ఆయన విమర్శించారు. బాధితులకు న్యాయంచేసే క్రమంలో నిరక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. జరిగిన సంఘటన పట్ల స్పందించాల్సిన – మిగతా4లో..

## ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యతనివ్వాలి

**గద్వాల ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్య తనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 64 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఇట్టి ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీఓ శ్రీనివాసరావులతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

## ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు

**ఎర్రవల్లి ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** ఎర్రవల్లి మండలం కోదండపురమ్ గ్రామం రైతు వేదిక ప్రాంగణంలో సోమవారం తెలంగాణ ఆయిల్ పెయిడ్ కార్పొరేషన్, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్‌సాగు పై రైతులకు అవగాహన సదస్సును ఎర్రవల్లి మండల వ్యవసాయశాఖ అధికారి సురేష్ కుమార్ గౌడ్ వ్యవసాయ విస్తరణ అధికారులు బిందు, ప్రవళిక,నరేష్ నిర్వహించారు. ప్రభుత్వం పూర్తిస్థాయి ప్రోత్సహకాలు అందిస్తున్నందున రైతులు సాంప్రదాయ పంటల నుండి ఆయిల్ ఫామ్ సాగుపై మల్లాలని ప్రభుత్వం అధిక సబ్సిడీలతో పాటు గ్యారంటీ ధర కల్పిస్తున్నందున దళారుల ప్రమేయం లేకుండా లాభాలు నేరుగా రైతులకే అందుతాయని ఆయిల్ ఫామ్ మొక్కలు ఒక్కసారి నాటితే 25 నుండి 30 ఏళ్ల పాటు ఆదాయాన్నిస్తుంది, రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుంది, ఎకరానికి అధిక దిగుబడి మార్కెట్ వడిదడుగుల భయం తక్కువ అని అవగాహన సదస్సులో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రామకృష్ణ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో వ్యవసాయశాఖ అధికారి

## విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**దామరగిద్ద, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షి టీమ్ పోలీసులు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల రక్షణ, ర్యాగింగ్,ఈవ్ టీజింగ్, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, బాల్య వివాహాల నివారణ, సైబర్ నేరాలు, సెల్ ఫోన్, సోషల్ మీడియా దుష్ప్రభావాలు వంటి అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా షి టీమ్ పోలీసులు బాలరాజు, చేన్నప్ప జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టిపెట్టి స్పష్టమైన లక్ష్యాలు పెట్టుకోవాలని సూచించారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ వంటి చర్యలు చట్టవిరుద్ధమని,అలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, అలాంటి ఘటనలు గమనించిన వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, షి టీమ్ పోలీస్ సిబ్బంది కవిత పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం

## ఎమ్మెల్యే ఇంటిపై దాడి ఘటనపై బీజేపీ నిరసన

**నారాయణపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి ఇంటిపై దాడికి పాల్పడ్డ కాంగ్రెస్ పార్టీ నేతల తీరును తీవ్రంగా ఖండిస్తూ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో నారాయణపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిని హౌస్ అరెస్ట్ చేయడాన్ని కూడా నాయకులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చర్యగా అభివర్ణించారు జిల్లా బీజేపీ అధ్యక్షుడు కె.సత్యయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల అహంకార ధోరణి రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తోందని విమర్శించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధుల ఇళ్లపై దాడులు చేయడం తీవ్రంగా ఖండించదగిన చర్య అని తెలిపారు ఈ నిరసన కార్యక్రమంలో పేట మున్సిపాలిటీ చైర్మన్ కొండ శ్వేత సత్య యాదవ్ , వైస్ చైర్మన్ మంజుల జీఆర్ రెడ్డి , కౌన్సిలర్లు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. జిల్లా నాయకులు సాయిబన్న, వెంకట్రాములు, బాలరెడ్డి, నారాయణరెడ్డి, కె. శ్రీనివాస్, దళిత మోర్చా అధ్యక్షుడు కృష్ణ, మిర్చి వెంకటయ్య, బీజేవైఎం అధ్యక్షుడు మణి శర్మ తదితరులు పాల్గొని కాంగ్రెస్ పార్టీ తీరును వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



నిరసన తెలియజేస్తున్న బిజెపి నాయకులు

## హేపటిస్ బి వ్యాక్సిన్ ద్వారా నిరోధక శక్తి పెరుగుతుంది : డాక్టర్ వంశీకృష్ణ

**వీపనగండ్ల ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** ప్రస్తుతము వాతావరణ పరిస్థితుల్లో రోగాలు అధికమై ప్రబలుతున్న దశలో ప్రభుత్వం నూతనంగా హేపటిస్ బి తీసుకురావడం జరిగిందని వీపనగండ్ల డాక్టర్ వంశీ కృష్ణ తెలిపారు. అయితే ఈ వ్యాక్సిన్ ద్వారా వ్యాధి నిరోధక శక్తి ప్రజలలో పెరిగి వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తుందని ఆయన తెలిపారు. ఈ వ్యాక్సిన్‌ను మొట్టమొదటిసారిగా ఆరోగ్య సిబ్బందికి వేయించడం జరిగిందని దీని ద్వారా వారి యొక్క ఆరోగ్య స్థితిగతులు ఏ రకంగా ఉన్నాయో తెలుసుకోవడానికి జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రజలకు వ్యాధులు ఎక్కువగా వస్తున్న దృష్ట్యా దానికి ప్రభుత్వం స్పందించి కొత్త రకమైనటువంటి వ్యాక్సిన్‌లను మెడికల్ మందులను కనుగొనడం జరుగుతుందని అందులో భాగంగానే హైపెట్టేటిస్ బి వ్యాక్సినేషన్ రావడం జరిగిందని దీన్ని అందరికీ కూడా వేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




ఆరోగ్య సిబ్బందికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్య బృందం

## కెసిఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని పాదయాత్ర

**పాదయాత్రకు స్వాగతం పలికి సన్మానించిన బీఆర్ఎస్ లీడర్ బచ్చిరెడ్డి**

**రాజాపూర్,ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని అంకిళ్ళ గ్రామం నుండి తెలంగాణ భవన్ వరకు పాదయాత్ర చేస్తు రామచందర్ పాదయాత్ర సోమవారం రాజాపూర్ మండల కేంద్రానికి చేరుకోగా బీఆర్ఎస్ నాయకులు,రాజాపూర్ గ్రామమాజీ సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షులు కొప్పెరి బచ్చిరెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు వనపర్తి సత్తయ్య, బీఆర్ఎస్ లీడర్ గుమ్మడవెల్లి అచ్చయ్య తదితరులు శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు. పాదయాత్ర చేస్తున్న రామచంద్రరావును అభినందించి పాదయాత్ర సజావుగా సాగాలని ఆకాంక్షించినట్లు వారు తెలిపారు.



పాదయాత్రకు స్వాగతం పలికి సన్మానించిన బీఆర్ఎస్ లీడర్ బచ్చిరెడ్డి

# అక్రమ అరెస్టులను ఖండించండి

## ఆత్మకూరులో బిజెపి నిరసన

**ఆత్మకూర్ ఫిబ్రవరి 23,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులను తలపిస్తూ ప్రతిపక్ష నాయకుల్ని అక్రమంగా అరెస్టులు చేయడం ఇకనైనా మానుకోవాలని అక్రమ అరెస్టులను ప్రజాస్వామికవాదులు తక్షణమే ఖండించాలని ఆత్మకూరు మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు జిందె శ్రీనివాసులు జ్యోతి మరియు భరత్ ఆత్మకూరు మండల బిజెపి అధ్యక్షులు అశోక్ భూపాల్ యాదవ్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలోని భైంసా మరియు కామారెడ్డిలో దాడులకు గురైన వారిని పరామర్శించకుండా దాడులకు పాల్పడ్డ వారిని రక్షిస్తూ అక్రమంగా అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని వారు తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుకలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్దేశపూర్వకంగానే నొక్కేస్తున్నారని అందులో భాగం గానే ప్రతిపక్ష పార్టీకి చెందిన బిజెపి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని అవతరిస్తూ చేయడం ఎంతవరకు సమంజసమని బాధితులను పరామర్శించడం తప్పు అంటూ వారు తీవ్రస్థాయిలో నిరసించారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి సొంత జిల్లా అయినా మహబూబ్నగర్ జిల్లాలో అగ్రవర్ణాల వారు బీసీలపై దాడులు చేస్తున్న ఏమాత్రం చర్యలు చేపట్టక పోవడమే కాకుండా అగ్రవర్ణాలకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ మరియు ప్రభుత్వం పని చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం దాడులకు పాల్పడ్డ వారిని తక్షణమే అరెస్టు చేయాలని లేని పక్షంలో బిజెపి ఆధ్వర్యంలో నిరవధిక ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని వారు హెచ్చరించారు. బిజెపి శాఖ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడమే కాకుండా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు పట్టణ బిజెపి అధ్యక్షులు సురేష్ బీజేపీ సీనియర్ నాయకులు ఆంజనేయులు ముదిరాజ్,, బిజెపి మాజీ ఫ్లోర్ లీడర్ అశ్విని కుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, మండల బిజెపి ప్రధాన కార్యదర్శి ఎల్లన్న, సీనియర్ నాయకులు రాజు విజయ్ శంకర్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న బిజెపి నాయకులు

## చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలి

**గద్వాల, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** పౌరులు తమ హక్కులు కాపాడుకునేందుకు, అన్ని రకాల వేధింపుల నుంచి బయటపడడానికి ఉన్న వివిధ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ మరియు జిల్లా మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణకు ఉద్దేశించిన పోస్(ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్మెంట్)2013 చట్టంపై సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు) నర్సింగరావుతో పాటు ముఖ్య అతిథిగా పాల్గొన్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పోస్ చట్టం 2013లో వచ్చినప్పటికీ సమాజంలో నేటికీ మహిళలపై వేధింపులు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లైంగిక వేధింపుల బారిన పడిన బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసినప్పుడే వేధింపులకు పాల్పడిన వారికి శిక్షలు పడి భవిష్యత్తులో ఎవరు కూడా అలాంటి తప్పులు చేయకుండా ఉంటారన్నారు. చట్టం సమర్థవంతంగా అమలు కావడానికి ఉద్దేశించిన వివిధ కమిటీలను సమర్థవంతంగా పనిచేసేలా రూపొందించాలని ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ నైతిక విలువల గురించి నీతులు చెప్పడమే కాదు వాటిని మనం పాటించినప్పుడే సమాజంలో ప్రతి ఒక్కరూ సంస్కారవంతమైన జీవనాన్ని గడపడానికి అవకాశం ఉంటుందన్నారు. మన ప్రవర్తన, చేసే ప్రతి పని మంచిదై ఉండి భవిష్యత్తు తరాలకు ఆదర్శవంతంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రస్తుతం పిల్లలు, యువతకు మనం ఏమైనా మంచి విషయాలు చెప్పినప్పుడు కొందరు వినడం లేదంటే అందుకు గల కారణాలపై విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చెడు మార్గాన్ని ఎంచుకున్నప్పుడు కలిగే పరిణామాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకొని జాగ్రత్తగా ఉంటే ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించిన వాళ్ళమవుతామని తెలిపారు. మహిళల సంక్షేమానికి ఉద్దేశించిన చట్టాలపై విస్తృతమైన ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పోస్ చట్టం కట్టుదిట్టంగా అమలు కావడానికి సహకరించేందుకు ఏర్పాటు చేస్తున్న కమిటీలు నిబద్ధతతో పనిచేస్తూ ముందుకెళ్లాలన్నారు. మహిళలపై లైంగిక వేధింపులను సమూలంగా నిర్మూలించేందుకు కమిటీ సభ్యులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టరు పిలుపునిచ్చారు. అనంతరం పోస్ చట్టం 2013 పై రూపొందించిన గోడ పత్రికలను ముఖ్య అతిధులు పలువురు జిల్లా అధికారులతో కలిసి విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ సునంద, ఇతర జిల్లా అధికారులు, వివిధ మండలాల తహసిల్దార్లు, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



గోడ పత్రికను విడుదల చేస్తున్న అధికారులు

## ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలి

**వీపనగండ్ల ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండలంలోని మామిడి రైతులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నాడు వీపనగండ్ల మండలంలోని సంగినేనిపల్లి గ్రామ శివారులోని మామిడి తోటలను వ్యవసాయ కార్మిక సంఘం బృందం పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీపనగండ్ల మండలంలో ఎక్కువ శాతం మామిడి తోటలను రైతులు పండించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సంవత్సరం మామిడి తోటలు పూత బాగా వచ్చినప్పటికీ అది వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మొత్తం పూత రాలిపోవడంతో పాటు వచ్చిన పిందెలు కూడా పసుపు కలర్ వచ్చి రాలిపోవడం జరిగిందని ఆయన తెలిపారు. తోట్లు గుత్తకు పట్టుకున్న కౌలు రైతులు సొంతంగా పెట్టుబడి పెట్టి దాదాపు ఎకరాకు 50 వేల నుండి 70 వేల వరకు పెట్టడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ విధంగా పెట్టుబడి పెట్టిన రైతులకు కౌలు రైతులకు తీవ్ర నష్టం ఏర్పడడం జరిగిందని దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కవులు రైతుకు మరియు రైతులకు ఎకరాకు లక్ష రూపాయల చొప్పున పెట్టుబడి నష్టపరిహారం ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చీడ పీడల బారిలో పడి మొత్తం కోట్లు అన్ని నాశనమై పెట్టుబడి మీద పడిందని ఆయన తెలిపారు. ప్రతి సంవత్సరం మామిడి తోటలు ఈ రకంగానే నష్టం వాటిల్లడం జరుగుతుందని కొంతమంది రైతులు అయితే కోట్లను తీసివేయడం జరుగుతుందని కాబట్టి ప్రభుత్వం మామిడి తోటలకు ఎన్నో రకాలుగా ప్రోత్సాహం కల్పిస్తుందని దాన్ని దృష్ట్యా ఈసారి కూడా నష్టపోయినటువంటి రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కోరారు. ఆయనతోపాటు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు రామచంద్రయ్య గౌడు రైతు సంఘం నాయకులు మహబూబ్ పాషా సంగినేనిపల్లి మాజీ సర్పంచ్ ఆర్ మోలాలి పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.



మామిడి తోటను పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

## గోల్డ్ మెడల్ సాధించిన అదనపు ఎస్పీని అభినందించిన జిల్లా ఎస్పీ

**నారాయణపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** 4వ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో నారాయణపేట జిల్లా అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హూల్ హక్ జోగులాంబ జోన్7 తరఫున లాన్ టెన్నిస్‌లో విశిష్ట ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని సాధించారు. 50 ఏళ్ల పైబడిన సీనియర్ అధికారుల లాన్ టెన్నిస్ విభాగంలో పాల్గొన్న ఆయన అద్భుతమైన ఆటతీరు ప్రదర్శిస్తూ ప్రత్యర్థులను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రథమ స్థానంలో నిలిచారు. క్రమశిక్షణ, నైపుణ్యం, క్రీడా స్ఫూర్తితో గోల్డ్ మెడల్ సాధించడం విశేషం. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీకి గోల్డ్ మెడల్ అందజేసి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. జోగులాంబ జోన్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ నారాయణపేట జిల్లాకు స్వర్ణ పతకాన్ని తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. క్రీడా రంగంలో పోలీస్ అధికారులు రాణించడం జిల్లా పోలీస్ విభాగానికి గర్వకారణమని, విధుల్లోనే కాకుండా క్రీడల్లో కూడా ప్రతిభ చాటడం ఇతరులకు స్ఫూర్తిదాయకమని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ తరఫున అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హూల్ హక్ కి జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



గోల్డ్‌మెడల్ సాధించిన అదనపు ఎస్పీని అభినందిస్తున్న ఎస్పీ

## నేడు, రేపు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయుల కోసం నేడు, రేపు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. 10వ తరగతి విద్యార్థుల ఫలితాలను మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సబ్జెక్టుకు ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి, బోధనా విధానాల్లో మెరుగులు దిద్దుకోవడం, విద్యార్థుల అభ్యాస లోపాలను గుర్తించడం, యాక్షన్ ప్లాన్ల రూపకల్పన పై చర్చలు జరపనున్నారు.నేడు తెలుగు బోధించే స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు అచ్చంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించనున్నారు. అదే విధంగా హిందీ ఉపాధ్యాయులకు ఉప్పునుంతల, అమ్రాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం జరుగుతుంది. ఇంగ్లీష్ బోధించే ఉపాధ్యాయులకు అచ్చంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించనున్నారు.గణితము బోధించే స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు వెల్టూరు ,మన్ననూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం ఉంటుంది. భౌతిక శాస్త్రము బోధించే ఉపాధ్యాయులు నడింపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరు కావాల్సి ఉంటుంది. జీవశాస్త్రం బోధించే ఉపాధ్యాయులకు అంబటిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించనున్నారు. సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులకు జిల్లా పరిషత్ హైస్కూల్ పదర లో సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సమావేశాల్లో 10వ తరగతి సిలబస్ పూర్తి ప్రగతి, విద్యార్థుల విద్యా స్థాయి అంచనా, పరీక్షల్లో తక్కువ మార్కులు సాధిస్తున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టడం, రిమీడియల్ క్లాసులు, అదనపు పీరియడ్ల నిర్వహణ వంటి అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా ప్రతి ఉపాధ్యాయుడు తమ తమ సబ్జెక్టుకు సంబంధించి స్పష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకొని, విద్యార్థుల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులు సూచించారు. అన్ని ఉపాధ్యాయులు సకాలంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరై, చురుకుగా పాల్గొని, విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలని విద్యాశాఖ కోరింది.

## డి.ఎ.అరియర్స్ ఏకమొత్తంలో ఏకకాలంలో చెల్లించాలి

**దేవరకద్ర, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలో ఎంపీడీవో శివప్రసాద్ కి మండల కార్యదర్శి బుచ్చన్న ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి బుచ్చన్న మాట్లాడుతు డిఎ అరియర్స్ కోసం సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడిందని ,ఎప్పుడు పడతాయో తెలియని అయోమయ పరిస్థితిలో ఉందన్నారు. సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులకు డి.ఏ అరియర్స్ విడతల వారిగా కాకుండా ఏక మొత్తం లో వెంటనే విడుదల చేయాలని తెలిపిపారు. డి ఎ ఏరియాస్ ఏకకాలంలో, ఏకమొత్తంలో, సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయుల ఖాతా ల్లో జమచేయాల్సిందిగా ప్రభుత్వాన్ని, ఎంపిడిఓ ద్వారా కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సుందర రాజు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఓకు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

## సీఎం దిష్టిబొమ్మ దహనం



సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

**జడ్చర్ల, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పిలుపుమేరకు బిజెపి మండల అధ్యక్షులు యాట రామకృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం జడ్చర్ల మండల కేంద్రంలో బిజెపి కామారెడ్డిలో ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఇంటిపై దౌర్జన్యం చేసినందున దానికి నిరసనగా రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు పరామర్శకు వెళ్ళగా అయనను అడ్డుకోవడం జరిగింది. రాష్ట్ర నాయకులు బిజెపి ఎమ్మెల్యేలను అక్రమంగా నిర్బందించడం జరిగింది. దానికి నిరసనగా జడ్చర్లలో ముఖ్య మంత్రి దిష్టి బొమ్మ దగ్ధం చేయడం జరిగింది. కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా బిజెపి సీనియర్ నాయకులు రమేష్ జి, మండల్ ఇంచార్జి సామల నర్సింలు, గిరిజన మోర్చా జిల్లా ఉప అధ్యక్షులు మహేందర్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి ఎడ్ల శ్రీనివాస్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి సక్కని మల్లేష్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు కాశన్న, మండల ఉపాధ్యక్షులు మహేష్ యాదవ్, గిరిజన మోర్చా మండల అధ్యక్షులు మోహన్ నాయక్, బీజేవైఎం మండల అధ్యక్షులు కొండ గణపతి గుప్త, ఓబీసీ మండలాధ్యక్షులు కుమార్ యాదవ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు బరిగెల శ్రీశైలం ముదిరాజ్, ధనుంజయ, మహేష్, చెన్నయ్య, దేవసింగ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సవరమ్మ గుడికి స్థలం కేటాయించండి

**తహసిల్దార్‌కు వినతిపత్రం ఇచ్చిన గ్రామ పెద్దలు, ప్రజలు**



తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**శ్రీరంగాపూర్,ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ గ్రామ పెద్దలు ప్రజలు కలిసి తమ గ్రామంలో సవరమ్మ గుడి నిర్మించడం కోసం నగరాల శివారులోని సర్వే నెంబర్ 666లో బంగారు మైసమ్మ దేవత దగ్గర ఉన్న స్థలం కేటాయించాలని శ్రీరంగాపూర్ తహసిల్దార్ రాజుకు సోమవారం గ్రామ పెద్దలు ప్రజలు కలిసి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది.

## రాయల గండి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మాజీ డిసిసిబి డైరెక్టర్



రాయలగండిలో జరిగిన బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మాజీ డిసిసిబి డైరెక్టర్ సత్తు భూపాల్ రావు

**ఉప్పునుంతల,ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** పదర మండలంలోని రాయల గండిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు డిసిసిబి మాజీ డైరెక్టర్, మాజీ సింగిల్ విండో చైర్మన్, మద్రిపల్లి సర్పంచ్ సత్తు భూపాల్ రావు హాజరయ్యారు. ఈనెల 21 నుంచి రాయలగండిలో శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో జరుగు కళ్యాణోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్ల మల్ల ప్రాంతంలో అరుదైన దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు అభినందనీయమని,అంతరించిపోతున్న ఆలయాల ప్రాముఖ్యత,ఆదరణపట్ల ప్రత్యేక దృష్టిసారించిన అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## కౌన్సిలర్‌కు ఘన సన్మానం

**అమరచింత ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** ఇటీవల జరిగిన మునిసిపాలిటీ ఎన్నికల్లో 9వ వార్డు నుండి బిజెపి కౌన్సిలర్ గా గెలుపొందిన విష్ణువర్ధన్ ను సోమవారం అమరచింతలో జాతీయ మాలల ఐక్యవేదిక నాయకులు ఘనంగా సన్మానించారు. జాతీయ మాలల ఐక్యవేదిక మండల అధ్యక్ష, కార్యదర్శులు విష్ణువర్ధన్ ను శాలువా పూలమాలలతో సన్మానించారు. మాలలకు వెన్నంటి ఉండి వందకు వందశాతం గెలుపు కోసం కృషి చేసిన 9వ వార్డు బిజెపి నాయకులు దుబాయ్ వెంకటేశ్వర్ రెడ్డి, అరేందర్ రెడ్డి, బాబు రెడ్డి, హనుమంత్ రెడ్డి, మంగ అనిల్ లకు అదేవిధంగా వార్డు ప్రజలకు మాలల ఐక్యవేదిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మాలలకు మునిసిపాలిటీలో ప్రాతినిధ్యం రావడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రామ్మూర్తి, రాములు, వెంకటస్వామి, రాఘవేందర్, వివిధ భార్గవ్, నవీన్, శేఖర్, రవి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, ఫిబ్రవరి23 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యానాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 40 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వరపరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లాస్థాయి అధికారులు చర్యలుచేపట్టాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రిప్రజావాణి నుంచివచ్చిన, పెండింగ్‌లో ఉన్న అర్జీలను సైతం వారంలో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 29 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

**నారాయణపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వ హించిన కార్యక్రమంలో మొత్తం 29 ఫిర్యా దులు అందాయి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను వినిపిస్తూ అర్జీలు సమర్పించారు. భూవివాదాలు, పింఛన్లు, ఆదాయ ధృవపత్రాలు, సంక్షేమ పథకాల అమలువంటి అంశాలపై ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిశీలించి సంబంధిత శాఖల ద్వారా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత




విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన దృశ్యం

**మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డిఎస్‌టి), గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విదూషి కార్యక్రమం ద్వారా విద్యార్థులను ముఖ్యంగా బాలికలను సైన్స్, పరిశోధన, ఆవిష్కరణలపై ఆసక్తిని పెంపొందించేందుకు ప్రోత్సహిస్తుంది. ఈ వర్క్‌షాప్‌లు, పోటీలు, ఎక్స్‌టెంపోర్, ప్రాక్టికల్ ప్రదర్శనల వంటి సైన్స్ కార్యకలాపాలకు మద్దతు ఇస్తుంది. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, ఎక్స్‌టెంపోర్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలోఇతర కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రొ॥ ఎకెడి భవాని పిఐ అండ్ కన్వీనర్, ప్రొ॥ బి. శిరీష, కో పిఐఅండ్ కన్వీనర్ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ అమీనా ముంతాజ్ జహాన్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు పిల్లల మేధస్సును పెంచుతాయని, రసాయన శాస్త్రం మీద ఆసక్తిని పెంచుతాయని తెలపడం జరిగింది. అదేవిధంగా వైస్ ప్రిన్సిపాల్ అనురాధ, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డా. శ్రీదేవి, రసాయన శాస్త్ర అధిపతి బి. అనిత, రసాయన శాస్త్ర అధ్యాపకులు, ఎంవిఎస్, డా. బిఆర్ఆర్ సాంఘిక సంక్షేమ కళాశాల విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

## పదోతరగతి, ఇంటర్ విద్యార్థులు టైం టేబుల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**నారాయణపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** పదవ తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకొని శ్రీ వీరధర్మజ మాణికేశ్వరి మాత నారాయణపేట ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్ కన్వీనర్ రామ్ రెడ్డి టైం టేబుల్ ప్యాకెట్ క్యాలెండర్‌ను రూపొందించారు. ఈ టైం టేబుల్ క్యాలెండర్‌ను సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు ఈ కార్యక్రమానికి జిల్లా ఇంటర్ విద్యాధికారి హెచ్. సుదర్శన్ రావు, కౌన్సిలర్ బండి రాజేశ్వరి, స్థానిక ఎమ్మెల్యే పీఏ మాధవరెడ్డి తదితరులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పరీక్షల సమయంలో సమయపాలన ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ టైం టేబుల్ ప్యాకెట్ క్యాలెండర్ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండి చదువులో ప్రణాళికాబద్ధతను పెంపొందిస్తుందని అన్నారు. విద్యార్థులు తమ రోజువారీ చదువు ప్రణాళికను ఈ క్యాలెండర్ ఆధారంగా రూపొందించుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ కోనగిరి హనుమంతు, సరాఫ్ నాగరాజు, ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు వాల్వేకర్ నికేతన్, దశరథ్, తమ్మలి సత్యనారాయణ, కొండల శ్రీనివాస్, మాన్య జయప్రకాశ్, ఏ. సునీల్, మల్లేష్, మల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయిజలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

**అయిజ ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** పట్టణ కేంద్రంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 5 కోట్ల రూపాయల కంటే ఎక్కువ నష్టాన్ని కలిగించిన సంఘటన తెలిసిందే ఇందులో భాగంగా ఐజ అఖిలపక్ష నాయకులు మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్ బియం సంతోష్ కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా అధికారులకు ప్రజాప్రతినిధులకు ప్రభుత్వాలకు అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని దీంతో ఇటీవల జరిగిన ప్రమాదంలో ఎంతో విలువైన డ్రిప్ ఫ్యాక్టరీ పూర్తిస్థాయిలో దగ్గమై ఐదు కోట్ల రూపాయలు నష్టం వాటిల్లిందని ఆయనకు గుర్తు చేశారు. అంతేకాకుండా అగ్నిమాపక కేంద్రం జిల్లా కేంద్రంలో ఉండడంతో ప్రమాదం జరిగితే సుమారు గంటకు పైన సమయం పట్టడం వల్ల అగ్ని ప్రమాదానికి గురైన సంఘటన పూర్తిస్థాయిలో ప్రమాదానికి గురి కావడం జరుగుతుందన్నారు. అదే అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే పరిసర చుట్టూ మండలాలైన గట్టు మల్లకల్ వడ్డేపల్లి రాజోలి మండల కూడా అణువుగా ఉంటుందని ఆయనకు గుర్తు చేశారు. జిల్లాలోని ప్రజా సంఘాల నాయకులు ఎమ్మార్పీఎస్ నాయకులు కమిటీ నాయకులు వివిధ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




కలెక్టర్‌కు విన్నవిస్తున్న అఖిలపక్షనాయకులు

# పిఎంశ్రీ విద్యార్థులు ముందుండాలి

◆ మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** పిఎం శ్రీ స్కూల్‌ల తనిఖీ లో భాగంగా సెంట్రల్ అబ్జర్వర్ ఫరీదా మహమ్మద్ నాయక్ బాలానగర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను, జడ్పిహెచ్ఎస్ రాజాపూర్ పాఠశాలను సందర్శించి పిఎం శ్రీ స్కీమ్‌లలో అమలైన ఇంటర్వెన్షన్స్ గురించి క్షుణ్ణంగా తనిఖీ చేసారు. పిఎం శ్రీస్కీంలో భాగంగా ఆ పాఠశాలలకు కేటాయించిన నిధులు, అక్కడ జరిగినటువంటి అభివృద్ధి పనులపై విద్యార్థుల్లో వచ్చిన మార్పులను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం కలెక్టర్ విజయేంద్ర బోయితో కలిసి ఐడీఓసి వీసీ మీటింగ్ హాల్లోపీఎం శ్రీప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీఎం శ్రీ స్కూళ్లు మిగతా స్కూళ్ళ కంటే అన్ని విషయాల్లో ముందుండాలని విద్యార్థుల యొక్క అభివృద్ధి కూడా మిగతా పాఠశాలల కంటే చాలా మెరుగ్గా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ మా జిల్లాలో



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

అన్ని పిఎం శ్రీపాఠశాలలో ఉన్నటువంటి అన్ని ఇంటర్వెన్షన్స్ అన్ని కూడా సరిగాఅమలయ్యేటట్లు చర్యలు తీసుకుంటామని సెంట్రల్ అబ్జర్వర్‌కి తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ కలెక్టర్ త్రివేంద్ర ప్రతాప్, స్టేట్ అబ్జర్వర్ జనార్ధన్‌రావు, సచ్చిదానంద రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, ఎఎంఒ దుంకుడు శ్రీనివాస్, సిఎంఒ సుధాకర్‌రెడ్డి, జిఈసివో అశ్రాఖాద్రి, పిఎం శ్రీపాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

◆ గద్వాల జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్

**గద్వాల, ఫిబ్రవరి23, ప్రభాతవార్త:** మార్చి 14వ తేదీ నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించు పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ఎలాంటి సమస్యలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత జిల్లా స్థాయి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బి. ఎం. సంతోష్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 40 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 8110 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాలను కలెక్టరేట్ స్ట్రాంగ్ రూమ్ నుంచి జిల్లాలోని 9 పోలీస్ స్టేషన్లకు పంపించి అక్కడి నుంచి పరీక్షా కేంద్రాలకు తరలించేందుకు నాలుగు రూట్లను ఏర్పాటు చేశామని, పటిష్ట పోలీస్ బందోబస్తు నియమించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ తరఫున ప్రతి పరీక్ష కేంద్రంలో ప్రాథమిక చికిత్సతో పాటు అవసరమైన మందు లను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులు నిర్దేశిత సమయంలోగానే తమ పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ తరఫున అదనపు బస్సులను



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నడిపేందుకు కృషి చేయాలన్నారు. వేసవిలో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉంటుండడంతో పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. తపాలా, ట్రెజరీ, మున్సిపల్, రెవెన్యూ, రవాణాశాఖ అధికారులు కూడా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో సహక రించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, అదనపు ఎస్పీ శంకర్, డీఈవో విజయలక్ష్మి, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సృజనాత్మకతకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

◆ నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట, ఫిబ్రవరి23 ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పప్పెట్రీ పోటీలలో నారాయణపేట జిల్లా ఉపాధ్యాయులు ప్రథమ స్థానం సాధించడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. విజేతలు శ్వేత కమ్మాన్‌పల్లి అంబిక ధన్వాడలను కలెక్టర్ తన చాంబర్‌లో అభినందించారు. ఉపాధ్యాయుల సృజనాత్మకత, అంకితభావం జిల్లాకు రాష్ట్రస్థాయి గుర్తింపు తీసుకువచ్చాయని ప్రశంసించారు. పప్పెట్రీ వంటి సృజనాత్మక బోధనా విధానాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి విజయాలు ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు జిల్లాలో అమలవుతున్న యంగ్‌ఒరేటర్స్ క్లబ్‌కార్యక్రమంవిద్యార్థుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలుపెంపొందిస్తున్నదని తెలిపారు. ఉపాధ్యాయు



విజేతలను అభినందిస్తున్న కలెక్టర్

లను ప్రోత్సహించిన జిల్లా విద్యాశాఖాధికారిని కూడా అభినందించారు. ఉపాధ్యాయుడు వెలిగితే విద్యార్థి వెలుగుతాడు" అని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాకు కీర్తి తీసుకువచ్చిన ఉపాధ్యా యులకు జిల్లా పరిపాలన తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థుల నైపుణ్యాల మెరుగుదలే లక్ష్యం

- డీఈఓ గోవిందరాజు

**నారాయణపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** జిల్లాలో నిర్వహించనున్న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ సర్వే శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖాధికారి గోవిందరాజు కేజీబీవి నారాయణపేటలో ప్రారంభించారు. ప్రాథమిక విద్యా నాణ్యతను అంచనా వేసి విద్యార్థుల చదవడం, లెక్కించడం నైపుణ్యాలను మెరుగుపరచడం ఈ సర్వే లక్ష్యమని తెలిపారు సర్వే విద్యా వ్యవస్థకు అద్దం పట్టే సాధనమని, ప్రతి ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ నిష్పక్షపాతంగా పనిచేయాలని సూచించారు. గత నాలుగేళ్లుగా చేపట్టిన కార్యక్రమాల ప్రభావం ఈ ఫలితాల్లో ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిసామర్థ్యాన్ని నిజాయితీగా నమోదు చేయాలని అన్నారు. శిక్షణలో సర్వే విధానం, ప్రశ్నాపత్రాల వినియోగం, డేటా నమోదు, సమయపాలన వంటి అంశాలపై మార్గదర్శనం అందించారు. 2వ తరగతి విద్యార్థులకు తెలుగు, గణితం, ఆంగ్లం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు

విషయాల్లో ఈసర్వే నిర్వహించనున్నారు ఫిబ్రవరి 25న తెలుగు, 26న గణితం, 27న ఆంగ్లం సర్వేలు జరుగుతాయి. ఎంపిక చేసిన68 పాఠశాలల్లో పారదర్శకంగా సర్వే నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ఛాత్రోపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల పోషణ వారసులదే బాధ్యత

◆ వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి

◆ సోమవారం ప్రజావాణిలో 16 ఫిర్యాదుల స్వీకరణ

**వనపర్తి, ఫిబ్రవరి23 ప్రభాతవార్త:** వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ పిల్లలపై వారసుల బాధ్యతని, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను విస్మరిస్తున్నట్లు పిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి హెచ్చరించారు. ప్రతి సోమవారం రోజు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయములో నిర్వహించే ప్రజావాణిలో భాగంగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి 16 మంది పిర్యాదుదారులు వివిధ సమస్యలపై నేరుగా జిల్లా ఎస్పీకి ఫిర్యాదులు అందించారు. ఫిర్యాదు చేసిన ప్రతి ఫిర్యాదుపై వనపర్తి ఎస్పీ స్పందించి స్వయంగా ఫిర్యాదును పరిశీలించి సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు తక్షణమే సదరు ఫిర్యాదులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశాలు జారీ చేశారు. వృద్ధుల గౌరవం కాపాడటం ప్రతి కుటుంబపు బాధ్యత తల్లిదండ్రులు పిల్లల కోసం కష్టపడిన రోజుల్ని గుర్తు చేసుకుంటూ, దీనితో ఫిర్యాదుదారులకు న్యాయం జరుగుతుందనే బరోసాను కలిగించే విధంగా జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవడంపై వచ్చిన ఫిర్యాదుదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రజావాణిలో మొత్తం 16 ఫిర్యాదుల్లో 02 భార్యభర్తల పిర్యాదులు 07 భూతగాదాల ఫిర్యాదులు07 పరస్పర గొడవలకు సంబంధించిన ఫిర్యాదులు వున్నాయి.





బాధితులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

# సంత్ సేవాలాల్ ఆశయ మార్గంలో నడవాలి

**సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి**

**నవాబుపేట, ఫిబ్రవరి23 ప్రభాతవార్త:** సేవాలాల్ జయంతి ఉత్స వాలలో జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి పాల్గొన్నారు. నవాబుపేట మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో నిర్వహించిన సేవాలాల్ జయంతి కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు, లంబడా నాయకులు పాల్గొని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లా డుతూ లంబాడ బిడ్డల ఆరాధ్య దైవమైన సంత్‌సేవాలాల్ ఆశయమార్గంలో నడవాలని లంబాడీలు ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం తండాలకు అనేకమైన అభివృద్ధి పథకాలను అందిస్తుం దని అన్నారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీగా ర్యాలీ నిర్వహించి లంబాడ నృత్యా లతో అలరించారు. కార్యక్రమానికి లంబాడ నాయకులు సేవా లాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఏఎంసీ వైస్ చైర్మన్ తులసి రామ్‌నాయక్ మండల అధ్యక్షులు నీరటి రామచంద్రయ్య, సేవ్యా నాయక్ సర్పంచ్ నీలకంఠం, శంకర్ నాయక్ అంబదాస్ సంతోష్ నాయక్ సర్పంచ్, కాజా, భాస్కర్ నాయక్ పలు లంబాడ సర్పంచ్‌లు తండల నాయకులు యువకులు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కూడా హాజరయ్యారని ఉత్సవ కమిటీ అధ్యక్షులు తులసి రామ్ నాయక్, గౌరవ అధ్యక్షులు విస్లావత్ చందర్ నాయక్, నాయకులు శంకర్ రాజు నరసింహనాయక్, తరుణ్ నాయక్ జాన్య, ప్రేమ్ కుమార్, హరి చందు గోపాల్‌నాయక్, గోవింద్, గిరిజన సర్పంచ్‌లు నాయకులు పాల్గొన్నారు.



సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

### ఉప్పునుంతలలో అవినీతి నిలయంపై
## ఏసీబీ అధికారుల డేగ కన్ను

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతలలో ఓ కార్యాలయం అవినీతి నిలయంగా మారింది. అవినీతి కార్యాలయం పట్ల పలువురు అవినీతి నిరోధక శాఖను సంప్రదించారు. కార్యాలయం అధినేత ఇష్టానుసారంగా డబ్బుల కక్కుర్తి పడి బరితెగించి విధిని నిర్వహిస్తున్నారని, ఈ కార్యాలయంలో కాసులు ఇవ్వకుంటే ఎలాంటి పని అవడం లేదు. ఈ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారితో పాటు కిందిస్థాయి సిబ్బంది ఆడింది ఆట, పాడింది పాటగా మారడంతో విసుగు చెందిన కొంతమంది అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులను ఆశ్రయించారు. ఆ కార్యాలయంలో ప్రతి అధికారి మాట్లాడుతున్న రికార్డును చేసిఎసిబి అధికారులను ఆశ్రయించారు. ఎసిబి అధికారులు బాధితులకు రికార్డు (వాయిస్) చేసే పరికరాన్ని అప్పగించారు. అధికారులుమాట్లాడినట్టు రికార్డు అయినప్పటికీ వారికి అనుమానంతో గత రెండు రోజుల నుంచి డబ్బులు తీసుకోకుండా ఉడాయిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ చరిత్రలో ఉప్పునుంతల మండలంలో రాజ్యమేలుతున్న అధికారుల భరతం పట్టేందుకు ఒక పన్నాగం చేపట్టారు. మొత్తం మీద ఉప్పునుంతల మండలంలో పనిచేస్తున్న ఒక ప్రధాన కార్యాలయంలోఅవినీతి నిరోధక అధికారుల దాడులకు బలి కావాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పవచ్చు.

## మామిళ్ళపల్లి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక విడుదల

**ఉప్పునుంతల, ఫిబ్రవరి23 ప్రభాతవార్త:** మండలంలోని మామిళ్ళపల్లిలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అచ్చంపేట ఎమ్మెల్యే ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈనెల 28నుంచి మార్చి 5 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకు ఆలయ కమిటీచైర్మన్ వేముల నరసింహారావు అందజేశారు. ఆహ్వాన పత్రిక విడుదల చేసిన వారిలో టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణతోఅచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, పాటు కట్ట అనంతరెడ్డి, ఎస్సై వెంకట్ రెడ్డి, పదర మాజీ జెడ్పిటిసి రాంబాబు నాయక్, వైద్యాధికారి డా. బిక్కు లాల్, అంతటి శేఖర్‌గౌడ్, గ్రామస్తులు, యువకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలో మూడవ బహుమతి సాధించిన నరహరి

**నారాయణపేట, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** నారాయణ పేట ఉట్కూర్ మండలంలోని అవుసలోనిపల్లి గ్రామానికి చెందిన నరహరి రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో మూడవ బహుమతి సాధించి మండలానికి కీర్తి తీసుకొచ్చాడు. నరహరి తండ్రి వెంకటయ్య చిన్న కుమారుడు ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో కఠినమైన పోటీని ఎదుర్కొంటూ నరహరి కాంస్య పతాకాన్ని అందుకున్నాడు. చిన్ననాటి నుంచే కుస్తీపై ఆసక్తి కలిగి నిరంతరం సాధన చేస్తూ ఈ విజయాన్ని సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విజయంపై గ్రామపెద్దలు, యువత, క్రీడాభిమానులు నరహరినిఅభినందించారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. గ్రామ యువతకు ప్రేరణగా నిలిచిన నరహరికి మండల ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

## స్థానిక ఎన్నికల్లో బీఎస్పీ ఒంటరిగా పోటీ

**బీఎస్పీ గద్వాల జోనల్ ఇంఛార్జ్ అంతటి నాగన్న**

**చిన్నంబావి, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** రాష్ట్రంలో వచ్చే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ ఒంటరిగా పోటీలో నిలుస్తుందని, ఎవరితో పొత్తు లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని బహుజన్ సమాజ్ పార్టీ గద్వాల జోనల్ ఇంచార్జ్ అంతటి నాగన్న అన్నారు. సోమవారం కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని చిన్నంబావిమండలంలో పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, పార్టీ విధానాలు రాబోయే రాజకీయ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలలో బహుజన్ సమాజ్ పార్టీ ఎటువంటి రాజకీయ పొత్తులు లేకుండా ఒంటరిగానేపోటీ చేస్తుందని స్పష్టంగా ప్రకటించారు. ప్రస్తుత పాలనలో పేదలు, దళితులు, వెనుక బడిన వర్గాలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలఅమలు పూర్తిగానిరక్ష్యాన్లికి గురయ్యాయని విమర్శించారు. ఈ పరిస్థితులకు ప్రత్యామ్నాయంగా బీఎస్పీ మాత్రమే నిజమైన ప్రజా పక్ష రాజకీయ శక్తిగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా కోశాధికారి బంకలి దాసు, కొల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి శ్రీ మునిస్వామి, అసెంబ్లీ అధ్య క్షుడు శ్రీబొల్లి కురుమయ్య, రాముడు పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలనేపథ్యంలో గ్రామస్థాయినుంచే పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజల సమస్యలపరిష్కారమే ధ్యేయంగా బహుజన్ సమాజ్ పార్టీ ముందుకు సాగుతుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ప్రతి విద్యార్థి ప్రగతిపై ఉపాధ్యాయులకు స్పష్టమైన అవగాహన అవసరం

**దామరగిద్ద, ఫిబ్రవరి23 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల పరిధిలోని క్యాతన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రాథ మిక పాఠశాల స్థాయి సముదాయ సమావేశం జిహెచ్‌ఎం సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి కనీస సామర్థ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. మండల విద్యాధికారి కృష్ణ రెడ్డి ముఖ్య అతిదిగా హాజరై సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ లక్ష్య నిర్దేశం, వాస్తవిక పురోగతి, తుది మూల్యాంకనం, మాక్ టెస్టుల విశ్లేషణ మరియు ప్రతి విద్యార్థి ప్రగతిపై ఉపాధ్యాయులకు స్పష్టమైన అవగాహన అవసరమని పేర్కొన్నారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం భాగంగా ప్రాథమిక స్థాయిలో 2వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయడానికి రాష్ట్ర స్థాయిలో ఫిబ్రవరి 25, 26, 27 తేదీలలో సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. అందుకు విద్యార్థులను సర్వేకు సిద్ధం చేయాలని సూచించారు. తెలుగు, గణితం, ఇంగ్లీష్ విషయాల్లో ధారాళంగా చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేయాలని అన్నారు. కార్యక్రమం మొదటి రోజు వివిధ పాఠశాలల నుంచి 50 శాతం మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్లు ఉసెనప్ప, సంజీవ్, కురుమూర్తి, సీఆర్పీలు మహిపాల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## బొడ్రాయి పండుగపై సమీక్ష సమావేశం

**వెల్దండ, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో బొడ్రాయి పండుగ నిర్వహించడానికి గ్రామ సర్పంచ్ కేశమల్ల అనూష కృష్ణ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మెజార్టీ గ్రామ ప్రజలు బొడ్రాయి పండుగను నిర్వహిద్దామని ఒక అభిప్రాయానికి వచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్‌కేశమల్ల అనుష కృష్ణ మాట్లాడుతూ వచ్చే నెలలో గ్రామ ప్రజలతో మరొక్కసారి సమావేశాన్ని నిర్వహించి ప్రజల అభీష్టం మేరకు అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహిద్దామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రసాద్ చారి, వార్డు సభ్యులు జక్కుల మల్లేష్ యాదవ్, రమేష్, నిరంజన్, శ్రీధర్ గౌడ్, మమత తిరుపతి, లలితమ్మ, అంజయ్య, రజినితో పాటు గ్రామ ప్రజలు ఉన్నారు.

